క్లుప్తంగా

ఘనంగా రామాలయ ప్రతిష్ఠోత్సవం



గుర్ల: పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో రామాలయం ప్రతిష్ఠోత్సవాలు మూడో రోజు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారామలక్ష్మణులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న పెద్దికృష్ణ కుటుంబ సభ్యులు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయ సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయా నికి పట్టణంలోని జగన్నాథరాజుకాలనీకి చెందిన పెద్దికృష్ణ రూ.50 వేల విరాళం అందజేశారు. నగదు మొత్తాన్ని ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, రాయల స్వామికి దాత తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం అందజేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి సంతోషిరూప

దత్తిరాజేరు: గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషిరూప అన్నారు. పీహెచ్‌సీలో 13 మంది గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు రోజూ పాలు, పండ్లు, గుడ్లు, శనగలు, ఆకుకూరలు తదితర పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

పర్వతారోహకుడికి రూ.5వేల సాయం



నాగరాజుకు నగదు అందజేస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లిరూరల్: రేగిడి ఆమదాలవలస మండలం ఉనుకూరు గ్రామానికి చెందిన పర్వతారోహకుడు మెనుగుల నాగరా జుకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు వంశీకృష్ణ రూ.5 వేల సాయం చేశారు. నాగరాజు వచ్చే నెల 3వ తేదీన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించనున్న నేపథ్యంలో ఆయనకు వంశీకృష్ణ ఆర్థిక సహాయం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆఫ్రికాలో గల మౌంట్ కిలిమంజారో, పశ్చిమ సిక్కింలోని మౌంట్ కాబ్రూసాత్, ఉత్తర సిక్కింలోని లకాకోంట్సే శిఖరాలను అధిరోహించినట్లు నాగరాజు తెలిపారు.

మహిళలకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న స్నేహ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక 'స్నేహ' స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో ఘనంగా సన్మానించారు. కె.నూకరత్నం(టీచర్), జి.వి.లక్ష్మి (కండక్టర్), ఎస్.కన్నమ్మ(ఆశ వర్కర్), కె.ప్రీతి (స్టేట్ షట్లర్), షేక్ తానీషా బేగం(స్టేట్ ర్యాంకర్) లకు జ్ఞాపికలు ఇచ్చి సన్మానించారు. ఇటీవల 'ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ప్రతిభ పరీక్షలో ఒక్కో పాఠశాలలో తొలిమూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్నేహ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఎస్.వెంకట రావు, మంథా సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ గణేష్, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ త్రినాథరావు, ఎం.ఎస్.ఎన్.మూర్తి, ఎం.రామకృష్ణ, భాస్కరరావు, వి.మురళి, రమేష్, ప్రకాశ్, శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

మహిళలను గౌరవిద్దాం..

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించి, వారు వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని అధికారులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో పాటు మండల కేంద్రాల్లో గురువారం ర్యాలీలు నిర్వహించారు. మహిళలకు పలు క్రీడల పోటీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బాల్యవివాహాలను అడ్డుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ఉద్యోగులను అధికారులు సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



గజపతినగరం: మహిళా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి రమేష్, ఎంపీడీఓ సుదర్శనం, సీడీపీఓ నాగమణి తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న మహిళా ఉద్యోగులు



దత్తిరాజేరు: మండల కేంద్రంలో అధికారులు, మహిళల ర్యాలీ



బొండపల్లి: బొండపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



జామి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు



కొత్తవలస: కొత్తవలసలో మహిళా దినోత్సవ ర్యాలీలో ఉద్యోగులు



లక్కవరపుకోట: ర్యాలీలో మండల ప్రత్యేకాధికారి శారదాదేవి, మహిళలు



గంట్యాడ: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



చీపురుపల్లి రూరల్: మహిళల మానవహారం



వేపాడ: మానవహారంగా ఏర్పడిన మహిళలు, అధికారులు



మెరకముడిదాం: మహిళా దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో ఉన్న సత్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్ల చలం నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు హాజరుకావాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు

గజపతినగరం: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అనాథ పిల్లలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బారిన పడిన పిల్లల కోసం 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాల(బీసీ, మైనార్టీ, ఓసీ)కు చెందిన పిల్లలకు 6శాతం చొప్పున ప్రభుత్వం సీట్లు కేటాయించిందని ఎంఈఓ విమలమ్మ తెలిపారు. స్థానిక విలేకరుల వద్ద గురువారం వివరాలు వెల్లడించారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో నివశించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండేవారికి రూ.1.44 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రవేశాలు పొందిన వారు పదో తరగతి వరకు ఉచితంగా విద్యతో పాటు అన్నిరకాల సౌకర్యాలు, పుస్తకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉన్నత చదువులకు రుణ సదుపాయం



మాట్లాడుతున్న జీఎం వరప్రసాదరావు

బొండపల్లి: ఉన్నత చదువుల కోసం యూనియన్ బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తూ, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ వరప్రసాద్ సూచించారు. గొట్లాంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకు సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించడానికి ముందుకు వచ్చే ప్రతీ విద్యార్థికి రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా కళాశాలకు లక్ష రుపాయలతో అవసరమైన సామగ్రి, ల్యాబ్ పరికరాలు అందజేయడానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకు రీజియన్ మేనేజర్ గురునాథరావు, గొట్లాం యూనియన్ బ్యాంకు మేనేజర్ పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అభినందన



వెంకటేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

గజపతినగరం: స్థానిక సమవి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి.వెంకటేష్ గతనెలలో పంజాబ్ రాష్ట్రంలోని పటియాలలో నిర్వహించిన ఆల్ ఇండియా స్థాయి 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్, శ్రీనివాసరావు, అధ్యాపకులు గురువారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పి.వెంకటేష్ పరుగు పందెం పోటీల్లో సత్తాచాటుతున్నాడని చెప్పారు. ఈ ఏడాది జనవరి నెలలో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 200 మీటర్లు, 400 మీటర్ల విభాగాల్లో రజత పతకాలు సాధించారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ డేని ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కళాశాల నుంచి వీడ్కోలు పలుకుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి, అధ్యాపకులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సందడి చేశారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం



వేపాడ: సోంపురంలో ఎడ్ల పరుగు ప్రదర్శన



చీపురుపల్లిరూరల్(గరివిడి): పేరంటాల అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



లక్కవరపుకోట: మల్లికార్జునస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

వేపాడ: మండలంలోని సోంపురంలో గ్రామదేవత ముత్యాలమ్మ తీర్థం గురువారం నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా సాయింత్రం ఎడ్ల పరుగుప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వరుసగా ఆరు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు నగదు బహుమతులును గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

ఎల్లారమ్మ పండగ

మండలంలోని ఓబలయ్యపాలెం గ్రామదేవత ఎల్లారమ్మ పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఘటాలతో ఊరేగింపుగా భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజ లు చేశారు. గ్రామపెద్దలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే ఎస్.కోట నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 16 జట్లు పాల్గొనగా విజేతలకు నగదు బహుమతి అందజేశారు.

మల్లికార్జునస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ

లక్కవరపుకోట: చందులూరు పంచాయతీ పరిధి కసిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు మూడో రోజు గురువారం కొనసాగాయి. వేద పండితుల ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, ఎల్.కోట,వేపాడ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

గౌరమ్మ పేరంటాల గుడి ప్రతిష్ఠ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం గదబవలస గ్రామంలో గౌరమ్మ పేరంటాలు గుడి ప్రతిష్ఠ గురువారం నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ భార్య, మాజీ ఎంపీ ఝాన్సీ పాల్గొని పూజలు చేశారు. జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొత్తవలస: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, గాడి అప్పారావు ఆధ్వర్యంలో వామపక్షాలు, రెవెన్యూ ఉద్యోగులు గురువారం ఆందోళన చేపట్టారు. సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని నినాదాలు చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. కొత్తవలస తాలుక యూనిట్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు తహసీల్దార్ డి.ప్రసాదరావు, సబ్ ట్రెజరర్ రాముకు వినతిపత్రం అందజేశారు.

శృంగవరపుకోట: పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, పీఆర్సీ ఎరియర్లు చెల్లించాలని కోరుతూ పెన్షనర్లు ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బైరాగిరాజు నేతృత్వంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉపఖజానాధికారి, డిప్యూటీ తహసీల్దార్‌కు అందచేశారు.

గజపతినగరం: ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం గజపతినగరం తాలూక యూనిట్ ప్రెసిడెంట్ సత్యం ఆధ్వర్యంలో గజపతినగరం ఉపఖజానా, తహసీల్దార్ కార్యాలయాల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. పెన్షన్ల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని కోరారు.

నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగు



ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



గుర్ల: అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తవలస: నవధాన్యాలు సాగుచేసి నేల తల్లిని కాపాడుకుందామని ప్రకృతి వ్యవసాయం ఫీల్డ్ కోఆర్డనేటర్ బి.గోవిందరావు కోరారు. మండలంలోని రామలింగాపురంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూసారంతో పాటు జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. రానున్న తొలకరిలో ప్రతి రైతు తమ ఇళ్లలోని మినుములు, పెసలు, ఉలవలు, కందులు, నువ్వులు, కాయకూర విత్తనాలను విత్తాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రశాంత్, మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, శ్రావ్య, రామలక్ష్మి పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

గుర్ల: నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏపీ సీఎస్ఎఫ్ శ్రీను అన్నారు. మండలంలోని జమ్ముపేట గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని చెప్పారు. సర్పంచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సమగ్ర రీసర్వే



మాట్లాడుతున్న సర్వేయర్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించడంతో పాటు శాశ్వత భూహక్కు కల్పిస్తూ పట్టాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్రభూరీసర్వే చేయిస్తోందని మండల సర్వేయర్ శ్రీనివాసరావు అన్నారు. మెరకముడిదాంలో చేపట్టనున్న రీసర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో రైతులు తమ పొలాలవద్ద ఉండి సిబ్బందికి సహకరించాలని కోరారు. తహసీల్దార్ బి.రత్నకుమార్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు గ్రామాల్లో గురువారం ప్రచారం చేశారు. చీపురుపల్లి పట్టణంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు ప్రచారంలో పాల్గొన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే జామి, గుర్ల, గరివిడి, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల్లో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ప్రచారం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లిరూరల్: ఆంజనేయపురంలో ప్రచారం చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నాయకులు



లక్కవరపుకోట: మహామాయ కర్మాగారంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



జామి: తాండ్రంగిలో ఎన్నికలు ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



బొండపల్లి: దేవుపల్లిలో సచివాలయ ఉద్యోగుల మద్దతు కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి



గుర్ల: తెట్టంగిలో ప్రచారం చేస్తున్న నాయకుడు స్వామినాయుడు



చీపురుపల్లిరూరల్: గరివిడి వెటర్నరీ కళాశాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జామి: మండల కేంద్రమైన జామి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దేముడు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా జామి, అలమండ అగ్రికల్చర్ ఫీడర్, లక్ష్మీపురం, జాగరం, పావాడ, వి.ఆర్.పాలెం, తానవరం, ఆలుగుబిల్లి, తాండ్రంగి, విజినిగిరి, కొట్టాం, అప్పన్నపాలెం, భీమసింగి, యాత పాలెం, వి.ఆర్.పాలెం, జన్నివలస, వెన్నె, శాశనపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి, గరుగుబిల్లి సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల కు శుక్రవారం విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు ఆర్ఈసీఎస్ ఏడీ జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతినగరం మండలంలో ..

గజపతినగరం: చల్లపేట రూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆ ఫీడర్ పరిధిలోని గజపతినగం మండలంలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ జి.శివకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. బూడిపేట, గంగచోళ్లపెంట, పాతబగ్గాం, కొత్తబగ్గాం, సాలిపేట, భూదేవిపేట, పట్రువాడ, కొనిశ, దావాలపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గుర్తించాలని కోరారు.

చీపురుపల్లి మండలంలో..

చీపురుపల్లిరూరల్: మండలంలోని పి.కె.పాలవలస సబ్‌స్టేషన్ పరిధి పెదనడిపల్లి, చిననడిపల్లి, గొల్లలములగాం, గొల్లలపాలెం, అలకనారాయణపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుదని ఆర్ఈసీఎస్ ఏడీ బి.జగన్నాథం గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఎస్.కోట మండలంలో..

శృంగవరపుకోట: పోతనాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఎస్.కోట పట్టణం, సీతంపేట, కృష్ణాపురం, భీమవరం, సంతగవిరమ్మపేట, తలారి, ఉసిరి, తిమిడి, వసి, వెంకటరమణపేట, కొత్తూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ రవి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నామని పేర్కొన్నారు.